సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం । 11 । మే । 2024



సోమశిలలో 7.94 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో శుక్ర వారం సాయంత్రానికి 7.942 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 210 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.75,380
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,751
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,954
నవర (8 గ్రాములు)	రూ.55,632



పోలీస్ అధికారులతో సమావేశం

ఎన్నికలకు సంబంధించి పోలీసులతో సమావేశాన్ని ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ నిర్వహించారు. నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో కార్యక్రమాన్ని జరిపారు. VIIIలో

న్యూస్‌రీల్

సత్యనారాయణస్వామికి చందనాలంకారం



స్వామివారికి లక్ష మల్లెలార్చనను నిర్వహిస్తున్న అర్చకులు

నెల్లూరు(బృందావనం): అక్షయ తృతీయ పర్వదినాన్ని పురస్కరించుకొని సంతపేట బ్రాహ్మణవీధిలోని వ్యాసరాజమఠం ప్రాంగణంలో కొలువైన రమా. సత్యనారాయణ స్వామి చందనాలంకారంలో భక్తులకు శుక్రవారం దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. స్వామివారికి లక్ష మల్లెలార్చనను సాయంత్రం వేడుకగా నిర్వహించారు. పూజా కార్యక్రమాలను కంబాలూరు నరసింహశ్రీధర్ ఆచార్యులు, రంగబాబు, సింహపురి మధ్వ సంఘ నిర్వాహకులు నిర్వహించారు. ఉభయకర్తలుగా వడ్లపూడి లక్ష్మీవెంకటసంజీవరావు, రాధిక దంపతులు వ్యవహరించారు. వ్యాసరాజ మఠం మేనేజర్ తడకపల్లి రవీంద్రబాబు, కార్యనిర్వాహకుడు అరవపల్లి సుబ్బారావు తదితరులు పర్యవేక్షించారు.

అగ్నివీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(మినీబైపాస్): భారత సైన్యంలో అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ విడుదలైన నేపథ్యంలో అర్హులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి రామాంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. 17 నుంచి 21 ఏళ్లలోపు వారు అర్హులని చెప్పారు. నేవీలో అగ్నివీర్ జనరల్ డ్యూటీ పోస్టులకు పదో తరగతి పాస్.. ట్రేడ్‌మెన్ పోస్టులకు కనీసం 8వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. పదో తరగతి సర్టిఫికెట్ల మేరకు దరఖాస్తుదారుని తల్లి, తండ్రి పేర్లు, పుట్టిన తేదీ, చెల్లుబాటయ్యే వ్యక్తిగత ఈ మెయిల్ ఐడీని పొందుపర్చాలని చెప్పారు. మొబైల్ నంబర్‌ను తప్పనిసరిగా నమోదు చేయాలని, స్కాన్ చేసిన సంతకం, 10 కేబీ నుంచి 20 కేబీ మధ్యలో ఉండేలా జేపీజీ ఫార్మాట్లో పాస్‌పోర్టు సైజు ఫొటోలను అప్‌లోడ్ చేయాలని కోరారు. ఆసక్తి గల వారు joinindianarmy.nic.in లేదా agniveernavy.cds.inలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

13న వేతనంతో కూడిన సెలవు

నెల్లూరు(సెంట్రల్): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని షాపులు, పరిశ్రమలు, సినిమా హాళ్లు, వాణిజ్య సంస్థల్లో పనిచేస్తున్న వారికి ఈ నెల 13వ తేదీన వేతనంతో కూడిన సెలవును మంజూరు చేయాలని సంయుక్త కార్మిక కమిషనర్ శ్రీనివాస్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

పోలింగ్ కేంద్రాల్లో మెరుగైన వసతులు



సూచనలిస్తున్న వెంకటరమణ


నెల్లూరు(బారకాసు): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నెల్లూరు సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వికాస్ మర్మత్ ఆదేశాల మేరకు అన్ని పోలింగ్ కేంద్రాల్లో మెరుగైన పారిశుద్ధ్య వసతులను కల్పించి ఓటర్లకు ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపడుతున్నామని ఎంహెచ్‌ఓ వెంకటరమణ తెలిపారు. నవాబుపేటలోని బీవీఎస్ బాలికల ఉన్నత పాఠశాల, తోటబడి తదితర పాఠశాలల్లో గల పోలింగ్ కేంద్రాలను శుక్రవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యమిస్తూ ప్రాంగణాలను శుభ్రం చేస్తున్నామని తెలిపారు. ఓటర్లకు తాగునీటి సదుపాయం, పరిశుభ్రమైన మరుగుదొడ్లు తదితరాలను కల్పిస్తున్నామని వివరించారు. ప్రత్యేకంగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి అత్యవసర చికిత్సలు అందించేలా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు.

నేటి నుంచి మద్యం దుకాణాల మూత

నెల్లూరు(క్రైమ్): ఎన్నికల నేపథ్యంలో శనివారం సాయంత్రం ఏడు నుంచి 13వ తేదీ సాయంత్రం ఏడు గంటల వరకు ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లు, కల్లు కేంద్రాలు తదితరాలను మూసేసేలా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు చర్యలు చేపట్టారు. ఓట్ల లెక్కింపు రోజూ దుకాణాలు మూతపడనున్నాయి. అనధికార మద్యం విక్రయాలు, నిల్వలు చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎక్సైజ్ అధికారి నాగమల్లేశ్వర్‌రెడ్డి హెచ్చరించారు.

సింహపురిలో సిరులు నింపుతా

సాక్షి ఇంటర్వ్యూలో నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి విజయసాయిరెడ్డి



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున రాజ్యసభ సభ్యుడిగా రెండుసార్లు ప్రాతినిధ్యం వహించి.. కేంద్ర మంత్రులు, కీలక శాఖలతో విస్తృత పరిచయాలున్న వ్యక్తిగా వేణుంబాక విజయసాయిరెడ్డి సుపరిచితుడు. మృదుస్వభావిగా.. అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు నిరంతరం కష్టపడేతత్వం గల ఈయన ఈ ఎన్నికల్లో పార్టీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థిగా పోటీచేస్తున్నారు. ముత్తుకూరు మండలం తాళ్లపూడిలో జన్మించిన ఈయన నెల్లూరు ఎంపీగా గెలుపొందితే అభివృద్ధిలో జిల్లా పరుగులు తీస్తుందనే నమ్మకం ప్రజల్లో బలంగా వ్యక్తమవుతోంది. ఈ తరుణంలో ఆయనతో సాక్షి ప్రత్యేక ఇంటర్వ్యూను శుక్రవారం నిర్వహించింది. తన లక్ష్యాలు.. అజెండా.. జిల్లా సర్వతోముఖాభివృద్ధికి చేపట్టే చర్యలను ఆయన తెలియజేశారు. – సాక్షి ప్రతినిధి, నెల్లూరు

ఇంటర్వ్యూ

- వైఎస్సార్‌సీపీకి ఆకాశమంత ఆదరణ
- ప్రచారాల్లో అడుగడుగునా బ్రహ్మరథం
- నెల్లూరును ప్రథమ స్థానంలో నిలుపుతా
- ఇక్కడ పోటీ చేయడం నా అదృష్టం
- భావసారూప్యత లేని కూటమి పార్టీలపై నమ్మకమేదీ..?



ప్రశ్న: జిల్లా అభివృద్ధిపై మీ అజెండా..

జవాబు: జిల్లాను దేశంలోనే నంబర్ వన్‌గా తీర్చిదిద్దాలనేదే నా ఆశయం. ఇదే లక్ష్యంగా ప్రత్యేక మేనిఫెస్టోను రూపొందించా. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో గల పార్టీ అభ్యర్థులు తదితరుల సమన్వయంతో మేనిఫెస్టోను తయారు చేశాం. చిత్తశుద్ధితో నూరు శాతం అమలయ్యేలా కృషి చేస్తాం.

ప్రశ్న: జిల్లా రైతాంగానికి మీరిచ్చే భరోసా..

జవాబు: రైతు భరోసా కేంద్రాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసి అన్నదాతలను అన్ని విధాలా ఆదుకుంటున్నారు. జిల్లాలోని మెట్ట ప్రాంత రైతులు అన్ని విధాలా అభివృద్ధి చెందాలని సంకల్పించాం. ఇందులో భాగంగా సోమశిల హైలెవల్ కెనాల్‌ను త్వరితగతిన పూర్తి చేస్తాం. తద్వారా లక్ష ఎకరాలకుపైగా సాగునీటిని అందించి బీడు భూములను సస్యశ్యామలం చేయాలనేదే నా ఆశయం. ఈ కాలువ ద్వారా సుమారు 2.5 లక్షల మందికి తాగునీరందనుంది. పెన్నా జలాలు వృథాగా సముద్రం పాలుకాకుండా చెరువులకు అనుసంధానిస్తాం. లక్ష టన్నుల వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేసేలా ప్రైవేట్ భాగస్వామ్యంతో మెగా గోడౌన్లను నిర్మిస్తాం. మామిడి రసం, పల్ప్ తీసే ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను ఉలవపాడులో ఏర్పాటు చేయిస్తాం. ఉలవపాడు మామిడికి అంతర్జాతీయ ఖ్యాతిని తీసుకొస్తాం.

పారిశ్రామికాభివృద్ధిపై మీ ప్రణాళిక..

జవాబు: జిల్లాకు చెందిన చాలా మంది ఇతర రాష్ట్రాలు, ఇతర దేశాల్లో పారిశ్రామికవేత్తలుగా ఉన్నత స్థానాల్లో స్థిరపడి ఉన్నారు. వీరి సహాయ సహకారాలతో జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ప్రత్యేక దృష్టి సారిస్తా. ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు జిల్లాలో చాలా అవకాశం ఉంది. జిల్లాలో కృష్ణపట్నం, రామాయపట్నం పోర్టులు రవాణాకు ఎంతో అనుకూలం. కార్గో రవాణాకు ఎంతో సులభంగా ఉంటుంది. బిట్రగుంటలో మెగా ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు సంకల్పించాం. దీని ద్వారా వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. జిల్లాలో మెగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేస్తాం.

ప్రశ్న: నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలపై..

జవాబు: జిల్లాలో ఐటీ నిపుణులకు ఉపాధి కల్పించేలా టెక్‌హబ్, ఐటీ పార్కులను నిర్మించాలనేదే లక్ష్యం. స్టార్టప్ ఇంక్యుబేటర్‌ను ఏర్పాటు చేసి అధిక సంఖ్యలో నిరుద్యోగులకు ఉపాధి కల్పించేలా చర్యలు చేపడతాం. ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా దేశంలోని ప్రముఖ కంపెనీల ప్రతినిధులతో ఆర్నెల్లకోసారి జాబ్ మేళాలను నిర్వహిస్తాం. యువత కోసం నైపుణ్య శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తాం.

ప్రశ్న: పర్యాటకంగా అభివృద్ధికి మీ ముందున్న లక్ష్యాలు..

జవాబు: పర్యాటకులను ఆకర్షించేలా జిల్లాలోని బీచ్‌లలో అన్ని వసతులతో రిసార్టులను ఏర్పాటు చేస్తాం. జిల్లాలోని ప్రముఖ ఆలయాలు, దర్గాల్లో మెరుగైన వసతులను కల్పించి పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం. ఉదయగిరి దుర్గాన్ని టూరిస్ట్ హబ్‌గా మార్చడమే ధ్యేయం.

ప్రశ్న: నగరాభివృద్ధిపై మీ లక్ష్యం..

జవాబు: నగరంలో ప్రధానంగా ఉన్న ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు రింగ్‌రోడ్డును మంజూరు చేయించి శరవేగంగా పూర్తి చేస్తాం. పారిశుధ్యాన్ని మెరుగుపర్చేలా డ్రైనేజీ వ్యవస్థను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తాం. భూగర్భ విద్యుత్ లైన్లను ఏర్పాటు చేయించేలా చర్యలు చేపడతాం. తద్వారా వృక్ష సంపదను కాపాడతాం. పేదల కోసం నగరంలోని నాలుగు ప్రాంతాల్లో రాజన్న క్యాంటీన్లను ఏర్పాటు చేస్తాం.

మౌలిక సదుపాయాలపై ప్రణాళిక..

జవాబు: జిల్లాలో జాతీయ రహదారులు, రైల్వే లైన్లు మెరుగ్గా ఉన్నాయి. ఎయిర్ కనెక్టివిటీ లేదు. దగదర్తి వద్ద విమానాశ్రయాన్ని నిర్మిస్తాం. తద్వారా ఇతర రాష్ట్రాలు, ఇతర దేశాలకు రవాణా మెరుగుపడుతుంది. ఆక్వా ఉత్పత్తుల ఎగుమతికి మార్గం సుగమమవుతుంది. మెట్ట ప్రాంతాలైన ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లో పెద్ద పరిశ్రమల ఏర్పాటుకు సంకల్పించాం. ఉలవపాడులో మామిడి పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నాం.

ప్రశ్న: పార్టీ నేతలు, కార్యకర్తలకు మీరిచ్చే భరోసా..

జవాబు: జిల్లాలో వైఎస్సార్‌సీపీకి ప్రజల్లో ఉన్న ఆదరణ ఆకాశాన్నంటుతోంది. పార్టీ కోసం పని చేసిన ప్రతి ఒక్కరికీ అండగా ఉంటా. పార్టీలో కష్టపడి పనిచేస్తున్న వారందర్నీ కుటుంబసభ్యులుగా భావిస్తున్నాను. అందరికీ తగిన సమయంలో సముచిత స్థానం లభిస్తుంది.

ఎన్నికల తర్వాత అందుబాటులో ఉండరన్న టీడీపీ విమర్శలపై..

జవాబు: నేను నెల్లూరులోనే పుట్టి.. పెరిగాను. ఉద్యోగ నిమిత్తం వివిధ నగరాలు తిరిగా. దివంగత సీఎం వైఎస్సార్ కుటుంబానికి విధేయుడిగా అంకితభావంతో పనిచేస్తున్నా. వైఎస్సార్‌సీపీలో కార్యకర్తగా.. నేనూ.. నా కుటుంబం ఎప్పుడూ జగన్‌మోహన్‌రెడ్డితోనే ఉంటాం. పార్టీకి సంబంధించి రాష్ట్రంలో ప్రతి చోట పనిచేశా. సొంత ప్రాంతానికి సేవ చేసుకునే అవకాశం లభించడం జన్మజన్మల సుకృతం. ఇక్కడి వాడిని.. ఇక్కడే ఉంటా. ప్రజాసమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తా. వేమిరెడ్డి, నారాయణ మాదిరిగా నాకు వ్యాపారాల్లేవు. రోజుకో దేశంలో ఉండే వేమిరెడ్డి ధ్యాసంతా డబ్బు సంపాదనపైనే. భావసారూప్యత లేని టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిపై పేద, బడుగు, బలహీన, మైనార్టీ ప్రజలకు నమ్మకం లేదు.

పచ్చ ప్రలోభాలు తారస్థాయికి

- ఓటర్లకు భారీగా నగదు పంపకాలు
- విచ్చలవిడిగా మద్యం సరఫరా
- సామాజికవర్గాల వారీగా ప్రలోభాలకు గురిచేస్తున్న టీడీపీ
- గంపగుత్తగా ఓట్ల కొనుగోలుకు రంగంలోకి దిగిన ఫైనం
- నిస్తేజంగా అధికారులు

ఉదయగిరి: ఎన్నికల్లో విజయమే ధ్యేయమనే రీతిలో టీడీపీ అభ్యర్థులు అడ్డదారులు తొక్కుతున్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు డబ్బుతో పాటు వివిధ తాయిలాలను ఎరవేస్తున్నారు. వృద్ధులకు సంబంధించిన హోమ్ ఓటింగ్‌కు రూ.2500 నుంచి రూ.ఐదు వేల వరకు వెచ్చించారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

పగలు ప్రచారం.. రాత్రి పంపకాలు

పగటి పూట ప్రచారాలు.. రాత్రి వేళ పంపకాలను టీడీపీ అభ్యర్థులు ముమ్మరంగా సాగిస్తున్నారు. కుటుంబాలను ఎంపిక చేసుకొని రహస్య సమావేశాలను ఏర్పాటు చేసి వివిధ హామీలను గుప్పిస్తూ నగదును పంపిణీ చేస్తున్నారు. ఉదయగిరి, ఆత్మకూరు, కావలిలో టీడీపీ అభ్యర్థులు శుక్రవారం నుంచే ఓటుకు రూ.1500 నుంచి రూ.2500 వరకు అందజేస్తున్నారు. ఎంపిక చేసిన కాలనీల్లో ఈ మొత్తం ఎక్కువగా ఉంటోంది. అక్కడక్కడా గంపగుత్తగా ఓట్లు కొనుగోలు చేసేందుకు పెద్ద మొత్తంలో డబ్బులిస్తున్నారు. ప్రార్థన మందిరాలు, ఆలయాలు, కమ్యూనిటీ అవసరాలకు కొంత మొత్తంలో నగదును పంపిణీ చేస్తున్నారు.

పోస్టల్ బ్యాలెట్ కొనుగోలుకూ పెద్ద మొత్తం

ఉద్యోగులకు సంబంధించిన పోస్టల్ బ్యాలెట్‌పై కన్నేసిన టీడీపీ నేతలు వాటిని దక్కించుకునేందుకు ఒక్కో నియోజకవర్గంలో రూ.2500 వరకు ముట్టజెప్పారని సమాచారం. ఉదయగిరిలోని కొన్ని మండలాల్లో రూ.మూడు వేల వరకు వెచ్చించారని తెలుస్తోంది.

నిస్తేజంగా నిఘా నేత్రం

ఎన్నికల్లో నగదు, మద్యం.. ఇతర తాయిలాలతో ఓటర్లను ప్రలోభపెట్టే ప్రక్రియను అడ్డుకునేందుకు ఎన్నికల సంఘం ఏర్పాటు చేసిన నిఘా బృందాలు నిస్తేజంగా ఉన్నాయి. ఓటర్లకు నగదు, మద్యాన్ని యథేచ్ఛగా పంపిణీ చేస్తున్నా, నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద నామమాత్రంగా తనిఖీలు జరుగుతున్నాయి. మద్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్నా పట్టించుకున్న దాఖలాల్లేవు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు నామమాత్రపు విధులతో చేతులు దులుపుకొంటున్నారు.

బరితెగించిన టీడీపీ నేతలు



ఏసీనగర్‌లో నగదును పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు



నెల్లూరు(క్రైమ్): ఎన్నికలకు మరో రెండు రోజులున్న తరుణంలో టీడీపీ నేతలు బరితెగించారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా ఓటర్లకు యథేచ్ఛగా నగదును శుక్రవారం పంపిణీ చేశారు. ఈ తంతు బహిరంగంగా జరుగుతున్నా పోలీసులు, ఫ్లయింగ్ స్క్వాడ్లు, ఎస్సెస్ టీమ్‌లు దృష్టి సారించలేదు. మరోవైపు నగరంలోని కొన్ని ప్రాంతాల్లో టీడీపీ అభ్యర్థికి సంబంధించిన కొందరు వ్యక్తులు నగదును పంపిణీ చేస్తున్నారని పోలీస్ అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో సిబ్బంది, ఫ్లయింగ్ స్క్వాడ్లను అప్రమత్తం చేశారు. వారు ఘటన స్థలానికి చేరుకొని అక్కడ ఎవరూ లేరని అధికారులకు వెల్లడించారు. అయితే సదరు వ్యక్తుల నుంచి కొంత మొత్తంలో నగదు తీసుకొని వదిలేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నగరంలో విస్తృత తనిఖీలు



నెల్లూరు(క్రైమ్): నగరంలో ఆకస్మిక తనిఖీలను ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ గురువారం అర్ధరాత్రి చేపట్టారు. తొలుత ఆయన మెడికవర్ హాస్పిటల్ సమీపంలోని చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేశారు. ప్రతి వాహన వివరాలను రికార్డుల్లో పొందుపర్చాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ప్రైవేట్ బస్సులను స్వయంగా తనిఖీ చేశారు. ఆర్డీఓ కార్యాలయంలో ఈవీఎంలను భద్రపర్చిన గది, భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఎస్బీ, బాలాజీనగర్, సంతపేట ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణారెడ్డి, వీరానాయక్, సుబ్బరాజు పాల్గొన్నారు.

- నెల్లూరు రూరల్ మండలం కనుపర్తిపాడులోని ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్ర భద్రత ఏర్పాట్లను ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ శుక్రవారం పరిశీలించారు. కళాశాల పరిసర ప్రాంతాల్లో మూడంచెల భద్రత, సీసీ కెమెరాల ఏర్పాటు, బ్యారికేడ్లు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తదితరాలపై పోలీస్ అధికారులతో చర్చించారు. ఎన్నికల సందర్భంగా చేపడుతున్న చర్యలను ట్రెయినీ ఐపీఎస్‌లకు తెలియజేశారు. కేంద్ర బలగాలతో కలిసి పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

రండి బాబూ.. రండి..!

- పురుషులకు రెండు క్వార్టర్లు, రూ.200
- మహిళలకు రూ.400
- అల్లూరులో కావ్య ర్యాలీలో ఇదీ తంతు

కావలి: కావలి టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి అల్లూరులో గురువారం నిర్వహించిన ర్యాలీ, ఎన్నికల ప్రదర్శనలో మద్యం ఏరులై పారింది. పురుషులకు రెండు మద్యం సీసాలతో పాటు రూ.200.. మహిళలకు రూ.400 చొప్పున పంపిణీ చేసి ర్యాలీకి తరలించారు. స్థానిక మద్యం దుకాణాలు ర్యాలీకి వచ్చిన వారితో కిటకిటలాడాయి. మద్యం, డబ్బును బహిరంగంగానే పంపిణీ చేయడం గమనార్హం. వాస్తవానికి ఆయన నిర్వహించే ఏ కార్యక్రమానికైనా అతి స్వల్పంగా ప్రజలు హాజరవుతున్నారు. ఈ తరుణంలో తన సభలు విజయవంతం అయ్యాయనే పోజు కొట్టేందుకు ఇలా డబ్బు, మద్యాన్ని ఎరవేస్తున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు కావలిలో నిర్వహించిన ప్రజాగళం సభలో కూడా ఇదే తంతు సాగింది.



కిటకిటలాడుతున్న మద్యం దుకాణం

మందుచూపు



ఎన్నికల నేపథ్యంలో మద్యం దుకాణాలు శనివారం సాయంత్రం మూతపడనున్నాయి. ఈ తరుణంలో మందుబాబులతో ఈ దుకాణాలు కిటకిటలాడాయి. వీరి తాకిడిని తట్టుకోలేక ఒకానొక దశలో దుకాణాలను సిబ్బంది కొద్దిసేపు మూసేశారు. అయినా మందుబాబులు ఎగబడి ఘర్షణలకు పాల్పడ్డారు. చివరికి పోలీసులు రంగప్రవేశం చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. – సీతారామపురం

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీకే వడ్డెర్ల మద్దతు

- వడ్డెర సేవా సంఘం జాతీయ అధ్యక్షుడు తన్నీరు ధర్మరాజు



మాట్లాడుతున్న ధర్మరాజు

కందుకూరు: రాజకీయంగా, సామాజికంగా అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీ, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే తమ మద్దతు ఉంటుందని వడ్డెర సేవా సంఘం జాతీయ అధ్యక్షుడు, శ్రీశైలం ట్రస్టు బోర్డు సభ్యుడు తన్నీరు ధర్మరాజు అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2004లో వైఎస్ రాజశేఖరరెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత వడ్డెర ఫెడరేషన్ ఏర్పాటు చేశారన్నారు. నాలుగు మున్సిపల్ చైర్మన్ పదవులిచ్చి ప్రోత్సహించారని చెప్పారు. ఆయన తర్వాత జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే వడ్డెర్లకు రాజకీయంగా అవకాశాలు కల్పించారన్నారు. 14 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు నాయుడు ఏమీ చేయలేదన్నారు. ఈ ఎన్నికల్లో పుట్టపర్తి ఎమ్మెల్యే సీటు ఇస్తానని హామీ ఇచ్చి మోసం చేశారని గుర్తు చేశారు. నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డి, కందుకూరు ఎమ్మెల్యేగా బుర్రా మధుసూదన్ యాదవ్‌ను గెలిపించాలని కోరారు. నాయకులు బూర్సు మాలకొండయ్య, తన్నీరు రమణయ్య, శ్రీను, యనమల మాల్యాద్రి, యనమల మాధవి తదితరులు పాల్గొన్నారు.

డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు ఆహ్వానం

వెంకటాచలం: మండలంలోని సరస్వతీనగర్‌లో ఉన్న దివ్యాంగుల ప్రాంతీయ సంయుక్త కేంద్రం (సీఆర్సీ)లో 2024 – 25 విద్యా సంవత్సరానికి గానూ స్పెషల్ ఎడ్యుకేషన్ ఇన్ డిప్లొమా ఇయరింగ్ ఎంపైర్మెంట్ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని సీఆర్సీ డైరెక్టర్ మనోజ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు సంవత్సరాల కాల వ్యవధి గల ఈ కోర్సులో చేరేందుకు ఇంటర్మీడియట్ 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు 45 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని తెలియజేశారు. జూన్ నెల 16వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

కాలువలోకి దూసుకెళ్లిన కారు

- వ్యక్తికి గాయాలు



మర్రిపాడు: మండల కేంద్రమైన మర్రిపాడు జూనియర్ కళాశాల సమీపంలో కారు కాలువలోకి దూసుకెళ్లిన ఘటన శుక్రవారం జరిగింది. కళాశాల మలుపు వద్ద కారు అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లడంతో అందులోని వ్యక్తికి గాయాలయ్యాయి. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మహిళను కాపాడిన మెరైన్ పోలీసులు



నీరు తాగుతున్న బాధితురాలు

ఇందుకూరుపేట: ప్రముఖ పర్యాటక కేంద్రం మైపాడు బీచ్‌లో ఓ మహిళను మెరైన్ పోలీసులు కాపాడారు. వివరాలిలా ఉన్నాయి. నెల్లూరులోని అయ్యప్ప గుడి ప్రాంతానికి చెందిన ఎ.భాగ్యమ్మ తన పిల్లలు, మామతో కలిసి శుక్రవారం మైపాడు బీచ్‌కు వచ్చింది. సముద్రంలో స్నానం చేస్తుండగా ఫిట్స్‌కు గురైంది. అక్కడే ఉన్న మెరైన్ పోలీసులు వర్ధన్, అల్లాభక్షు వెంటనే స్పందించి ఆమెను కాపాడి ప్రాథమిక చికిత్స అందించారు. చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో నెల్లూరుకు తరలించారు.

ఆటో బోల్తా

- వ్యక్తికి గాయాలు



గాయపడిన వెంకటేశ్వర్లురెడ్డి

మర్రిపాడు: మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల సమీపంలో శుక్రవారం ఆటో అదుపుతప్పి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు.. ఖాదర్‌పూర్ గ్రామానికి చెందిన బారెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి ఆటో బోల్తా పడి గాయపడ్డాడు. స్థానికులు గుర్తించి అతడిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	: రూ.100
సన్నవి	: రూ.50
పండ్లు	: రూ.35

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం

- నిర్భయంగా ఓట్లు వేసేలా చర్యలు
- నాలుగువేల మందికి పైగా సిబ్బందితో బందోబస్తు
- సమస్యాత్మక ప్రాంతాల్లో కేంద్ర బలగాల మోహరింపు
- శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు
- ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్



మాట్లాడుతున్న ఎస్పీ ఆరిఫ్ హఫీజ్

నెల్లూరు(క్రైమ్): 'పోలింగ్ సందర్భంగా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టాం. జిల్లాతోపాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల పోలీసు సిబ్బంది, కేంద్ర బలగాలు నిరంతరం గస్తీ నిర్వహిస్తున్నాయి. సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచాం. నేరచరితులను గుర్తించి ఇప్పటికే బైండోవర్ చేశాం. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు సహకరించడంతోపాటు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రజలందరూ వినియోగించుకోవాలి' అని ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ కోరారు. సోమవారం పోలింగ్ సందర్భంగా తీసుకున్న చర్యలను నెల్లూరులోని పోలీస్ అతిథి గృహంలో శుక్రవారం ఆయన వివరించారు.

సమస్యాత్మక కేంద్రాలపై..

జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల పరిధిలో 1,446 ప్రాంతాల్లో 2,470 పోలింగ్ కేంద్రాలున్నాయి. అందులో 213 ప్రాంతాల్లో 450 సమస్యాత్మక కేంద్రాలున్నాయి. వీటిపై ప్రత్యేక దృష్టిసారించాం. జిల్లా పోలీసులతోపాటు కేంద్రబలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించాం. ఇప్పటికే ఆయా ప్రాంతాల్లోని ప్రజలతో మమేకమై ఎన్నికల నియమావళిని వివరించడంతోపాటు ప్రశాంత ఎన్నికలకు సహకరించాలని విజ్ఞప్తి చేశాం. ఎన్నికల వేళ అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరికలు జారీచేశాం. కేంద్ర బలగాలతో భద్రతను కట్టుదిట్టం చేశాం. వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లను సైతం చేశారు.

నేరచరితులపై చర్యలు

ఎన్నికల వేళ శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు చేపట్టాం. రౌడీషీటర్లతోపాటు ట్రబుల్ మాంగర్స్, గత ఎన్నికల కేసుల్లోని నిందితుల బైండోవర్ల ప్రక్రియ కొనసాగుతోంది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 107, 109, 110 సీఆర్‌పీసీ కింద 10,485 మందిని బైండోవర్ చేశాం. ఎన్నికలు ముగిసేంత వరకు వీరిపై ప్రత్యేక నిఘా ఉంటుంది. ఎన్నికల వేళ అల్లర్లు సృష్టిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. జిల్లాలో 533 లైసెన్స్‌డ్ ఆయుధాలుండగా 530 ఆయుధాలను డిపాజిట్ చేశాం.

బందోబస్తు ఇలా..

ఎన్నికలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశాం. జిల్లా పోలీసులతోపాటు విశ్రాంత పోలీసు, ఆర్మీ అధికారులు, ఎన్‌సీసీ అధికారులతోపాటుగా నాలుగు ప్లటూన్ల బీఎస్ఎఫ్ బలగాలు, నాలుగు కంపెనీల తమిళనాడు స్టేట్ ఆర్మ్‌డ్ ఫోర్స్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన సివిల్ పోలీసులు మొత్తంగా నాలుగువేల పైచిలుకు మందితో బందోబస్తు ఏర్పాటు చేశాం. పోలింగ్ స్టేషన్ పరిసరాల్లో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలు చేస్తాం. ప్రశాంత వాతావరణంలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. నియమావళి ఉల్లంఘనపై 67 కేసులు నమోదుచేశాం. సోషల్ మీడియా పోస్టులపై నిఘా ఉంచాం.

నియోజకవర్గానికో ప్రత్యేకాధికారి

ఎన్నికల నిర్వహణలో భాగంగా నియోజకవర్గానికి ఒక ప్రత్యేక అధికారిగా నియమించాం. నెల్లూరు సిటీ నియోజకవర్గానికి నగర డీఎస్పీ, రూరల్ నియోజకవర్గానికి ట్రాఫిక్ డీఎస్పీ, కోవూరుకు దిశ డీఎస్పీ, సర్వేపల్లికి నెల్లూరు రూరల్ డీఎస్పీ, కావలికి కావలి డీఎస్పీ, కందుకూరుకు డీఎస్పీ, వెంకటగిరి పరిధిలోని మండలాలకు ఏఆర్ డీఎస్పీ, ఉదయగిరికి ఇన్‌చార్జి సీసీఎస్ డీఎస్పీని ప్రత్యేకాధికారిగా నియమించాము. వీరు ఎన్నికలు పూర్తయ్యే వరకూ ఆయా ప్రాంతాల్లో విధులు నిర్వహించనున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

ఓటు వజ్రాయుధం. రాజ్యాంగం కల్పించిన ఈ హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. జిల్లాలో ప్రశాంత ఎన్నికలకు అందరూ సహకరించాలి.

ప్రలోభాల కట్టడికి చర్యలు

ఎన్నికలవేళ మద్యం, ధన ప్రవాహం, ప్రలోభాలకు గురిచేసే వస్తువులను కట్టడి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. జిల్లా వ్యాప్తంగా 18 చెక్‌పోస్టులను ఏర్పాటు చేశాం. 26 ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందాలు, 26 ఎస్ఎస్, 46 ఎంసీసీ, 105 క్విక్ రెస్పాన్స్ టీంలు ఏర్పాటు చేసి నిరంతర తనిఖీలు నిర్వహిస్తున్నాం. లాడ్జీలు, ప్రైవేటు గెస్ట్‌హౌస్‌ల్లో సైతం తనిఖీలు జరుగుతున్నాయి. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నాటి నుంచి తగిన ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.2,72,31,845ల నగదును సీజ్ చేసి ఆదాయపు పన్నుశాఖ అధికారులకు అప్పగించాం. రూ.2,72,054 విలువచేసే వస్తువులను స్వాధీనం చేసుకున్నాం. మూడు కేసుల గంజాయిని పట్టుకున్నాం. 663 కేసుల్లో రూ.30,56,981 విలువ చేసే 3,990.04 లీటర్లు (19,366 బాటిళ్లు), పది కేసుల్లో రూ.78,435 విలువచేసే పొరుగు రాష్ట్రాలకు చెందిన 205.8 లీటర్లు (1,009 బాటిళ్లు) మద్యంను స్వాధీనం చేసుకుని నిందితులపై కేసులు నమోదు చేశాం. నాటుసారాపై దాడులు చేసి 37.5 లీటర్లను స్వాధీనం చేసుకుని 28,700 లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేశాం. తనిఖీలు కొనసాగుతున్నాయి. ఎన్నికల ప్రలోభాలపై సీ విజిల్ యాప్, 1950 హెల్ప్‌లైన్, డయల్ 112కు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటాం.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 157	బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 304
లేయర్ (లైవ్)	: 103	లేయర్ చికెన్	: 175
బ్రాయిలర్ చికెన్	: 274		

ఓటింగ్ శాతం పెంచడానికి చర్యలు



పింక్ పోలింగ్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న బాలికతో హరినారాయణన్

- కలెక్టర్ హరినారాయణన్
- పింక్ పోలింగ్ కేంద్రం ప్రారంభం

నెల్లూరు(బారకాసు): రానున్న ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచడమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. సంతపేటలోని సెయింట్ జోసఫ్స్ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పింక్ పోలింగ్ కేంద్రాన్ని ఆర్వో వికాస్ మర్మత్, పలువురు బాలికలతో కలిసి కలెక్టర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి నియోజకవర్గంలో మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్న చోట పోలింగ్ కేంద్రాన్ని పింక్ రంగుతో ముస్తాబు చేసి.. వారికి ఆహ్వానం పలికేలా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. సంతపేటలోని 30వ నంబర్ పోలింగ్ కేంద్రంలో 756 మంది మహిళా ఓటర్లు, 597 మంది పురుష ఓటర్లు ఉన్నారని తెలిపారు. సిటీ ప్లానర్ దేవీకుమారి, ఎంహెచ్‌ఓ వెంకటరమణ, బీఎల్వో మౌనిక తదితరులు పాల్గొన్నారు.

నోడల్ అధికారులతో సమీక్ష

ఓటింగ్ పూర్తయ్యేంత వరకు ప్రక్రియను సంబంధిత అధికారులు పరిశీలించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఎన్నికల నోడల్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియను కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పరిశీలించేందుకు గానూ అధికార బృందాలను నియమించామని చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కెమెరాలు పనిచేస్తున్నాయానే అంశాలను పరిశీలించాలని సూచించారు. కేంద్రాల్లో ఈవీఎంలను మార్చాల్సిన పరిస్థితొస్తే వెంటనే సంబంధిత నోడల్ అధికారులకు తెలియజేయాలని కోరారు. ఒకవేళ మరమ్మతులకు గురైతే భెల్ ఇంజినీర్ల సహకారాన్ని పొందాలన్నారు. పోలింగ్ సిబ్బంది.. సెక్టోరల్ ఆఫీసర్లకు రెండు చొప్పున వాహనాలను రిజర్వ్‌లో ఉంచాలని చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో 12వ తేదీ ఉదయానికి వెబ్ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ట్రెయినీ కలెక్టర్ సంజనాసిన్హా, డీఆర్వో లవన్న, నోడల్ అధికారులు బాపిరెడ్డి, రాజు, సుధాకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును నమ్మితే నట్టేట మునిగినట్టే..

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

వెంకటాచలం: చంద్రబాబును నమ్మి ఎన్నికల్లో ఓట్లు వేస్తే నట్టేట మునిగినట్టేనని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని కసుమూరు గ్రామంలో శుక్రవారం కాకాణి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాబు తన పాలనలో ఎన్నికల హామీలను సక్రమంగా నెరవేర్చిన దాఖలాల్లేవని తెలియజేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకిచ్చిన ప్రతి వాగ్దానాన్ని అమలు చేసి వారి అభిమానాన్ని చూరగొన్నారని కొనియాడారు. మోసం చేసే చంద్రబాబు కావాలా? చెప్పిన దానికంటే మిన్నగా సంక్షేమ పథకాలు అందించిన జగన్ కావాలా? ప్రజలు ఆలోచన చేయాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్లను వలంటీర్ల ద్వారా పంపిణీ చేయించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని చెప్పారు. వారు పెన్షన్లు ఇవ్వకుండా చంద్రబాబు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించి అడ్డుకున్నాడని మండిపడ్డారు. బాబు తన పాలనలో పేదలకు ఏం మేలు చేశారో సమాధానం చెప్పి ప్రజలను ఓట్లు అడగాలని డిమాండ్ చేశారు. తాను మేలు చేశానని నమ్మితేనే ఓటు వేయండని కోరుతున్న వ్యక్తి దేశ చరిత్రలో వైఎస్ జగన్ ఒక్కరేనని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, మండల కన్వీనర్ కొణిదెన మోహన్ నాయుడు, ఎంపీపీ మందా కవిత, గ్రామ సర్పంచ్ కడివేటి శివ, నాయకులు కొణిదెన విజయభాస్కర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇంటికెళ్తుండగా..

- డివైడర్‌ను ఢీకొన్న మోటార్‌బైక్
- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం



ఘటనా స్థలంలో వేణు మృతదేహం

మనుబోలు: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందిన ఘటన మనుబోలు బైపాస్ రోడ్డు వద్ద శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. పెళ్లకూరు మండలం చిల్లకూరు వడ్డిపాళెం గ్రామానికి చెందిన చల్లా నరేష్, చెంచు దంపతుల కుమారుడు చల్లా ఆకాష్ (19) నాయుడుపేటలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. అలాగే అదే గ్రామానికి చెందిన బండి చంద్ర, నాగమ్మ దంపతుల కుమారుడు బండి వేణు (18) ఇంటర్‌లో చదువు మానేసి మెగా ఇన్‌ఫ్రా కంపెనీలో పనిచేస్తున్నాడు. వేణు, ఆకాష్ స్నేహితులు. నెల్లూరులో ఫైనాన్స్ కంపెనీలో నగదు చెల్లించేందుకు మోటార్‌బైక్‌పై వెళ్లారు. పని ముగించుకుని ఇంటికి బయలుదేరారు. ఈ క్రమంలో మనుబోలు మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా హైవేపై లారీని అధిగమించే క్రమంలో ప్రమాదవశాత్తు బైక్ డివైడర్‌ను ఢీకొంది. ప్రమాదంలో వేణు అక్కడికక్కడే మృతిచెందగా ఆకాష్ తలకు తీవ్ర గాయమైంది. అతడిని చికిత్స నిమిత్తం నెల్లూరులోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. యువకుల మృతితో కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు. వడ్డిపాళెంలో తీవ్ర విషాదం నెలకొంది.

కొనసాగుతున్న తనిఖీలు



మనుబోలు హైవేపై వాహన తనిఖీలు

నెల్లూరు(క్రైమ్): ఎన్నికల వేళ మద్యం, నగదు అక్రమ రవాణా కట్టడిలో భాగంగా జిల్లా వ్యాప్తంగా తనిఖీలు కొనసాగుతున్నాయి. శుక్రవారం నెల్లూరు చిన్నబజారు పరిధిలో రూ.1.53 లక్షలు, కొడవలూరులో రూ.5 లక్షలు, వరికుటంపాడులో రూ.2,72,500 నగదును ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తుండగా పోలీసు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మనుబోలులో 12, దుత్తలూరులో 10, ఎఎస్‌పేటలో 6, ఎస్ఈబీ 198మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని నిందితులపై కేసులు నమోదు చేశారు. ఏఎస్ పేటలో 1,100 లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేశారు.

అప్రమత్తంగా విధులు నిర్వహించాలి

- ఎస్పీ ఆరిఫ్ హఫీజ్



సమావేశానికి హాజరైన పోలీసు అధికారులు

నెల్లూరు(క్రైమ్): 'సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలి. ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలి' అని ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ ఆదేశించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై శుక్రవారం ఆయన నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాల్లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారదర్శకత, ప్రశాంత ఎన్నికలకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. సమయ స్ఫూర్తితో విధులు నిర్వహించాలని, ఏమాత్రం అలసత్వం ప్రదర్శించరాదన్నారు. ఓటర్లతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల లోపు జన సమూహం లేకుండా చూడాలన్నారు. కేంద్రాల్లోకి వాటర్ బాటిల్స్, ఇంకు సిరాలు, బాల్‌పెన్‌లు, మొబైల్ ఫోన్లు తదితరాలను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించరాదన్నారు. ప్రిసైడింగ్ అధికారి అనుమతి లేకుండా కేంద్రంలోకి వెళ్లరాదన్నారు. సమస్యాత్మక కేంద్రాల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. బాడీవార్న్ కెమెరాలు వినియోగించి అవాంఛనీయ ఘటనలు, నేరాలు జరగకుండా ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. చెక్‌పోస్టులోని సిబ్బంది ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి మద్యం, నగదు అక్రమ రవాణాను కట్టడి చేయాలన్నారు. ప్రత్యేక అధికారులు తమకు కేటాయించిన నియోజకవర్గాల్లో ఎన్నికలు సజావుగా జరిగేందుకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఏఎస్పీలు సీహెచ్ సౌజన్య, శ్రీనివాసరావు, ట్రెయినీ ఐపీఎస్‌లు, డీఎస్పీలు, సీఐలు, ఎస్బీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నా బలం.. బలహీనత ప్రజలే

- నా తండ్రిని, నన్ను తొమ్మిది సార్లు గుండెల్లో పెట్టుకున్నారు
- వెన్నుపోటుదారులకు ప్రజలే బుద్ధి చెప్పడం ఖాయం
- డబ్బులకు ఓటర్లు ప్రలోభ పడతారనుకోవడం టీడీపీ భ్రమే
- ఐదేళ్లలో ప్రభుత్వం ప్రతి కుటుంబానికి రూ.లక్షల్లో సంక్షేమం
- వైఎస్సార్‌సీపీని గెలిపించడమే లక్ష్యంగా ఓటర్లు సిద్ధం
- 'సాక్షి'తో కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి



కోవూరు ప్రజలకు మా కుటుంబం ఎంతో రుణపడింది

కోవూరు: జిల్లా రాజకీయాల్లో కోవూరుకు ప్రత్యేక స్థానం ఉంది. భౌగోళికంగా జిల్లా కేంద్రానికి కూత వేట దూరం నుంచే ఈ నియోజకవర్గ సరిహద్దు ప్రారంభమవుతోంది. ప్రధానంగా పెన్నార్ డెల్టా ప్రాంతంగా ఉన్న ఈ నియోజకవర్గంలో అత్యధికంగా వ్యవసాయం మొదటి స్థానంలో ఉంటే.. ముఖ్యంగా రెండు మండలాల పరిధిలో విస్తరించిన విశాల సముద్ర తీరం.. కడలిని నమ్ముకుని జీవనం సాగించే మత్స్యకార కుటుంబాలు అత్యధికం. మత్స్య సంపద వ్యాపారం రెండో స్థానంలో ఉంది. ఈ నియోజకవర్గంలో అత్యధికంగా పేద, మధ్య, దిగువ మధ్య తరగతి ప్రజలే ఉన్నారు. ఇక రాజకీయ కోణంలో పరిశీలిస్తే.. ఇక్కడ గెలుపోటములపై తలలు పట్టుకోవాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ఈ నియోజకవర్గంలో నల్లపరెడ్డి కుటుంబంపై పోటీ చేసేందుకు ఎవరొచ్చినా.. వారిని ఆదరించిన చరిత్ర లేదు. ఐదు దశాబ్దాలుగా కోవూరు 'నల్లపరెడ్డి' కుటుంబాన్ని గుండెల్లో పెట్టుకుంది. ప్రజలే తన బలం.. బలహీనతగా భావించే ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి మరోసారి బరిలో నిలబడ్డారు. ఎన్నికల క్షేత్రంలో తలమునకలై ఉన్న ప్రసన్నకుమార్‌రెడ్డితో 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూ.

ప్రశ్న: కోవూరు నియోజకవర్గంలో ఆరు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఈ సారి కూడా విజయం దక్కుతుందని భావిస్తున్నారా?

జవాబు: కోవూరు నియోజకవర్గంలో నేను, నా తండ్రి ఇప్పటి వరకు 11 సార్లు పోటీ చేశాం. 9 సార్లు ప్రజలు మా కుటుంబాన్ని ఆదరించారు. కోవూరు నియోజకవర్గ ప్రజలు మమ్మల్ని ఎంతగా నమ్ముతున్నారో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. మా బలం.. బలహీనత ప్రజలే. కోవూరు ప్రజలకు మా కుటుంబం ఎంతో రుణపడి ఉంది. ప్రజల కష్టాలను తెలుసుకుని వెళ్లి అండగా నిలబడుతుండడంతోనే ప్రజలు మాకు పట్టం కట్టుతున్నారు. ఈ సారి కూడా తప్పకుండా ప్రజలు నన్ను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారు.

ప్రశ్న: మీరు దాదాపు 40 ఏళ్ల నుంచి రాజకీయంలో ఉన్నారు. ఇన్నేళ్లలో మీరేం సంపాదించారు.

జవాబు: నా తండ్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి మరణాంతరం 1990లో నేను ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావడం జరిగింది. అప్పటి నుంచి నా తండ్రి ఆశయాలకు అనుగుణంగా నడుచుకుంటూ ప్రజలకు సేవ చేయడడం చాలా సంతృప్తినిచ్చింది. నా తండ్రి నుంచి నా వరకు సంపాదించుకున్నది ప్రజల్లో గుండెల్లో స్థానం. నేనెప్పుడు రాజకీయాన్ని అడ్డం పెట్టుకుని సంపాదించలేదు. నా తండ్రి, తాతల నుంచి వారసత్వంగా వచ్చిన ఆస్తులను అమ్ముకున్నాను. నేను అవినీతికి పాల్పడ్డాననే ఆరోపణ ఎవరూ చేయలేరు. ఇదే నాకు పెద్ద ఆత్మ సంతృప్తిగా చెప్పవచ్చు.

ప్రశ్న: మీపై ధనవంతులైన వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని పోటీకి దింపడంపై మీ అభిప్రాయం?.

జవాబు: ఈ నియోజకవర్గంలో ప్రజలు నల్లపరెడ్డి కుటుంబానికి అండగా ఉన్నారు. నన్ను ఓడించాలంటే.. ఆ పక్కన కూడా ప్రసన్నే ఉండాలి. వాళ్ల పార్టీలో అలాంటి వాళ్లు లేకపోవడంతో ఓటర్లు, నాయకులు డబ్బులకు అమ్ముడుపోతారనే నీచపు ఆలోచనతో ధనవంతులైన ప్రశాంతిరెడ్డిని చంద్రబాబు కావాలనే నాపై పోటీకి దించారు. ఓటమి భయంతోనే ఈ నిర్ణయం తీసుకున్నారు.

ప్రశ్న: టీడీపీ అభ్యర్థి ఓట్లను వేలం వెర్రిగా కొనేస్తున్నారనే ప్రచారం ఉంది. మీరు నెగ్గుకురాగలరని అనుకుంటున్నారా?

జవాబు: కచ్చితంగా ప్రజల గుండెల నిండా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారు. గడిచిన ఐదేళ్లలో ప్రతి కుటుంబానికి రూ.లక్షల్లో సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి జరిగింది. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి గెలవకపోతే ఇలాంటి పథకాలు రావనే భయం ప్రజల్లో ఉంది. కాబట్టి ప్రజలందరూ జగన్..జగన్ అంటున్నారు. ఏ కష్టమొచ్చినా నేను ఆదుకుంటాననే నమ్మకం నాపై ప్రజలకు ఉంది. ఈ రోజు ఎన్నికలొచ్చాయి కదాని, తాత్కాలికంగా ఓటర్లను కొనేద్దామనుకుంటే కోవూరు నియోజకవర్గ ప్రజలు చాలా విజ్ఞులు. వారి జిమ్మిక్కులను తిప్పి కొడతారు. పొరపాటున కూడా చంద్రబాబుకు, ఆ పార్టీ అభ్యర్థికి ఓటు వేసేందుకు ప్రజలు సిద్ధంగా లేరు.

ప్రశ్న: మీ పార్టీ నుంచి ప్రతి మండల లీడర్ టీడీపీ వైపు వెళ్లిపోయారు. ఈ ప్రభావం మీపై ఎలా ఉంటుంది?

జవాబు: ఈ రోజు పార్టీని విడిచి పెట్టిపోయిన వారందరూ గత ఎన్నికల్లో కూడా నాకు వ్యతిరేకంగానే పని చేశారు. అయినా ప్రజలు నన్నే ఆదరించారు. రాష్ట్రంలో మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. వీరంతా నా వద్దకు చేరారు. నేనెప్పుడూ ఎవరినీ శత్రువుగా చూడలేదు. చూసే వ్యక్తిత్వం కూడా నాది కాదు. ఇక్కడికి వచ్చి ఎంతో సంపాదించుకున్నారు. మళ్లీ ఎన్నికల్లో అవతల కోటీశ్వరులు రావడంతో డబ్బుల కోసం కక్కుర్తిపడి వెళ్లిపోయారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారు. ఇలాంటి వెన్నుపోటుదారులకే కాకుండా.. మొన్నటి వరకు మా పార్టీలో పదవులు అనుభవించి.. ఇప్పుడు నాపై పోటీ చేస్తున్న వేమిరెడ్డి దంపతులకు కూడా ప్రజలు సరైన బుద్ధి చెబుతారు.

ప్రశ్న: సంక్షేమ పథకాలు ఇచ్చి ప్రజలను సోమరిపోతులను చేస్తున్నారని, మీ ప్రత్యర్థి ప్రశాంతిరెడ్డి అంటున్నారు. దీనికి మీరు ఏమి సమాధానం చెబుతారు?

జవాబు: పేదలను అవమానిస్తూ.. కోట్ల రూపాయిలకు పడగలెత్తి, విలాసవంతమైన జీవితం గడుపుతున్న అహంకారులకు ప్రజలే బుద్ధి చెబుతారు. రోజు కూలి పని చేసుకునే వారికి వారి పిల్లల చదువు కోసం, వయస్సు అయిపోయిన అవ్వా తాతలకు మందుల కోసం, 45 ఏళ్లు పైబడిన మహిళలకు, వ్యవసాయం చేసుకునే రైతులకు పెట్టుబడి కింద, ఇలా పేదల కోసం అనేక రకాల సంక్షేమ పథకాలు అందిస్తున్న జగన్ మోహన్ రెడ్డిని ప్రజలు దేవుడిలా చూస్తున్నారు.

ప్రశ్న: ఈ ఐదేళ్లలో నిజంగా ప్రజలకు మంచి జరిగిందని మీరు భావిస్తున్నారా?

జవాబు: ప్రజలకు మంచి జరిగిందో లేదో మేము చెప్పాల్సిన పనిలేదు. ఏ గ్రామంలో అయినా మహిళల బ్యాంకు పాసు పుస్తకం తీసుకుని గడిచిన ఐదేళ్ల బ్యాంకు స్టేట్‌మెంట్, 2014 నుంచి 2019 వరకు బ్యాంకు స్టేట్‌మెంట్ చూస్తే మీకే తెలుస్తుంది. ఎవరి ప్రభుత్వంలో ప్రజలకు సంక్షేమం అందిందో తెలుస్తుంది.

ప్రశ్న: నియోజకవర్గంలో ముఖ్యంగా కోవూరులో అభివృద్ధి ఎలా ఉంది?

జవాబు: కోవూరు మండలంలో చెప్పాలంటే ఎంతో కాలంగా పాత బైపాస్ రోడ్డు వెడల్పు కోసం ప్రయత్నం జరిగింది. అందుకు నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్‌తో కలిసి రూ.2 కోట్ల వ్యయంతో రోడ్డు వెడల్పు చేయడం జరుగుతోంది. దశాబ్దాలుగా ఉన్న ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం జరిగింది. దశాబ్దాల కలగా ఉన్న పాటూరు వెళ్లే దారిలో కలుజు కారణంగా ఎంతో మంది ఇబ్బందులు పడుతున్నారు. దానిపై వంతెన నిర్మాణం కోసం రూ. 2.45 కోట్లతో చేయడం ఎంతో ఆనందంగా ఉంది.

ప్రశ్న: నెల్లూరు బ్యారేజ్‌కి మీ తండ్రి పేరు పెట్టారు.. ఆ ఫీలింగ్ ఎలా ఉంది?

జవాబు: నా తండ్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి నెల్లూరు జిల్లాకు సాగు, తాగు నీరు అందించేందుకు ఎంతో కృషి చేశారు. జిల్లా రాజకీయాల్లోనే కాకుండా రాష్ట్ర రాజకీయాల్లో తనదైన గుర్తింపు తెచ్చుకున్నారు. తన తండ్రి గుర్తింపుగా సాగునీటి ప్రాజెక్ట్‌కు ఆయను పేరు పెట్టమని సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని అడిగాను. నెల్లూరుకే ఐకాన్ అయిన పెన్నా బ్యారేజీకి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి బ్యారేజ్ అని నామకరణం చేయడం చాలా ఆనందంగా ఉంది.

ప్రశ్న: 2019, 2024 ఎన్నికలకు తేడా ఏంటి?

జవాబు: 2019లో జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రమంతా తిరిగి ప్రజల కష్టాలను కళ్లారా చూసి, అనేక సంక్షేమ పథకాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడు 2019 ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలే కాక ఇవ్వని హామీలను ఎన్నో అమలు చేశాము. ఇప్పుడు మళ్లీ తిరిగి 2019 మేనిఫెస్టో చూపించి హామీలన్నీ అమలయ్యాయి కాబట్టే ఓటు వేయమని ధైర్యంగా ప్రజలను అడుగుతున్నాం.

ప్రశ్న: మరో రెండు రోజుల్లో ఎన్నికలు జరగనున్నాయి. కోవూరు నియోజకవర్గ ప్రజలకు మీరేం చెప్పదలచుకున్నారు.

జవాబు: కష్టకాలంలో ఎవరు ప్రజలకు అండగా ఉన్నారో, ప్రజలకు ఏ సమస్య వచ్చినా ఎవరు అందుబాటులో ఉన్నారో గమనించి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నా. గెలిస్తే విదేశాలకు వెళ్లి సెటిలయ్యే వాళ్లని ఓటుతో తరిమికొట్టాలని పిలుపునిస్తున్నాను. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమే వస్తుంది.. ఈ నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి పనులు చేసుకునే అవకాశం ఉంటుంది. ఒక్క రోజు ఇచ్చే డబ్బులకు ప్రలోభపడితే.. ఐదేళ్లు వాళ్ల కాళ్ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉంటుంది.

ప్రశ్న: బుచ్చి మండలంలో అభివృద్ధి జరగలేదని ప్రశాంతిరెడ్డి ఆరోపణలపై మీ సమాధానం?

జవాబు: నిన్నగాక మొన్నొచ్చిన ప్రశాంతిరెడ్డి అభివృద్ధి జరగలేదని మాట్లాడటం చాలా విడ్డూరంగా ఉంది. బుచ్చిరెడ్డిపాళెం నుంచి జొన్నవాడ వరకు రూ.3 కోట్లతో బీటీరోడ్డు నిర్మించాం. మా ప్రభుత్వ హయాంలో జరిగినంత అభివృద్ధి ఏ ప్రభుత్వ హయాంలో జరగలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే మేజర్ పంచాయతీగా ఉన్న బుచ్చిని నగర పంచాయతీగా చేయడం జరిగింది. రూ.2 కోట్లతో సెంట్రల్ లైటింగ్, రూ.85 కోట్లతో ఎస్ఎస్సార్ మంచినీటి పథకం, రూ.కోటితో బైపాస్ రోడ్డు, రూ.1.20 కోట్లతో పట్టణంలో పార్కు అభివృద్ధి పనులు చేయడం జరిగింది. వీటితో పాటు పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో రూ. వందలకోట్లు వెచ్చించి రోడ్లు, డ్రైన్లు నిర్మించడం జరిగింది. ఇవన్నీ అభివృద్ధి పనులు కాదా?. నియోజకవర్గంలో ప్రతి ఊరులో సచివాలయాలు, విలేజ్ క్లినిక్స్, ఆర్‌బీకేలు.. ఇలా అనేక రకాల భవనాలు నిర్మించి పాలన చేరువ చేశారు. ఇది అభివృద్ధి కదా?



అభివృద్ధి, సంక్షేమానికే ఓటు

ఉదయగిరి: ఉదయగిరి ప్రజల తీర్పు ఎప్పుడూ విలక్షణంగా ఉంటుంది. ఇక్కడ గెలుపు ఓటములను వలస వెళ్లి అక్కడ బాగా స్థిర పడిన నేతలు ప్రభావితం చేసేందుకు వస్తారు. ఎవరూ ఎన్ని విధాలుగా ప్రలోభాలు పెట్టినా ప్రజలు మాత్రం అభివృద్ధికే ప్రాధాన్యత ఇస్తారు. వ్యవసాయాధారిత ప్రాంతం. పాడి–పంట రెండు కళ్లు. కల్మషం లేని, కాయకష్టం చేసుకుని జీవనం సాగించే ప్రజలు మేలు చేసిన వారికే పట్టం కడుతారు. గడిచిన ఐదేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమంతో ప్రజల జీవన స్థితిగతులు మారాయి. ఈ ఐదేళ్లల్లో ప్రభుత్వం చేపట్టిన మూడు జాతీయ రహదారులు, ఒక ఎక్స్‌ప్రెస్ హైవే పనులు శరవేగంగా జరుగుతున్నాయి. నియోజకవర్గ అభివృద్ధి ముఖచిత్రం మారుతోంది. ఉదయగిరి ప్రజలు మేకపాటి కుటుంబాన్నే ఆదరిస్తున్నారు. మా కుటుంబం సైతం నిస్వార్థంగా ఉదయగిరి అభివృద్ధికి కృషి చేస్తోంది. సోమశిల, వెలుగొండ ప్రాజెక్ట్ నీటితో రాబోయే ఐదేళ్లలో నియోజకవర్గం సస్యశ్యామలంగా మారుతోంది. స్పష్టమైన అభివృద్ధి చేసి చూపిస్తానని చెబుతున్న ఉదయగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూ.

- ఉదయగిరి అభివృద్ధే మేకపాటి ఫ్యామిలీ అజెండా
- వచ్చే ఐదేళ్లలో సస్యశ్యామలం, స్పష్టమైన అభివృద్ధి చూపిస్తా
- టీడీపీ పాలనలో అభివృద్ధి మార్క్ ఒక్కటైనా ఉందా?
- 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూలో మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

అర్హులైన ప్రతి ఒక్కరికి రూ.లక్షల్లో సంక్షేమ సాయం



ప్రశ్న: ఉదయగిరిలో మేకపాటి ఫ్యామిలీకి ప్రత్యేక స్థానం ఉంది. మరి ఈ ఎన్నికల్లో మీ కుటుంబాన్ని మరోసారి ప్రజలు ఆదరిస్తారా?

జవాబు: కచ్చితంగా మా కుటుంబాన్ని ప్రజలు ఆదరిస్తారనే నమ్మకం ఉంది. ఎందుకంటే మా అన్న నుంచి నా వరకు నిస్వార్థంతో ఉదయగిరి అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నాం. ఈ విషయం ప్రజలకు తెలుసు. టీడీపీ హయాంలో ప్రజల జీవన రేఖలు మార్చే ఏదైనా ఒక్కటంటే ఒక్కటి ఉందా?. లేదు. ఉదయగిరి మెట్ట ప్రాంతం. వ్యవసాయాధారం. సాగునీరొస్తేనే ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుంది. సోమశిల, వెలుగొండ ప్రాజెక్ట్ నీటిని తెచ్చేందుకు పనులు జరుగుతున్నాయి. ఇది మా కుటుంబం కృషేనని ప్రజలకు తెలుసు. కాబట్టి మరోసారి మా కుటుంబంలో నన్ను ఆదరిస్తారని భావిస్తున్నాను.

ప్రశ్న: మీరు ఉదయగిరి సమన్వయకర్తగా పది నెలలు నియోజకర్గంలో విస్తృతంగా తిరిగారు. మీకు ప్రజల నుంచి లభించిన ఆదరణ ఎలా ఉంది? మీకు సంతృప్తినిచ్చిన అంశాలు ఏమిటి?

జవాబు: సీఎం జగన్ నాకు బాధ్యతలు ఇచ్చిన వెంటనే అన్నీ గ్రామాలు తిరిగాను. ప్రజలు నన్ను ఒక సోదరుడిగా ఎంతో ఆప్యాయతగా ఆదరించారు. వారి అభిమానం ఎప్పటికి మరవలేనిది. ఈ క్రమంలో అనేక సమస్యలు నా దృష్టికి వచ్చాయి. నేను పరిష్కరించే వాటిని తక్షణమే పరిష్కరించాను. 16 సచివాలయాల పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించిన తర్వాత సీఎంను కలిశాను. అదనపు నిధులు అడిగాను. రాష్ట్రంలో ఏ నియోజక వర్గానికి ఇవ్వని విధంగా మా నియోజకవర్గంలోని ప్రతి సచివాలయానికి రూ.40 లక్షలు నిధులు ఇచ్చారు. వీటితో ఎన్నో అభివృద్ధి పనులు చేశాము. మా కుటుంబంపై ప్రజలకు ఉన్న ప్రేమాభిమానాలు చూసి నియోజకవర్గ ప్రజల సేవలోనే ఉండాలని నిర్ణయించుకున్నాను.

ప్రశ్న: మేకపాటి కుటుంబం మీ గెలుపు కోసం పని చేసిన నేతలను, కార్యకర్తలను పక్కన పెట్టి, పక్క పార్టీ వారికి ప్రాధాన్యత ఇస్తారనే విమర్శ క్యాడర్‌లో వినిపిస్తోంది?

జవాబు: పార్టీకి పని చేసే వారిని ఎప్పుడూ మేకపాటి కుటుంబం విస్మరించదు. అందరిని సంతోష పరచాలనే ఉద్దేశం, వారిని మన వారిగా చేసుకోవాని ఆలోచనతో ముందుకెళ్తున్నాం. ఈ క్రమంలో మా పార్టీలో ఉన్న వారికి కొంత మనస్తాపం కలిగి ఉండొచ్చు. ఇప్పటి వరకు రాజకీయంగా ఉన్న పరిస్థితులపై అవగాహన పెంచుకున్నాను. స్వార్థంతో పార్టీని వీడిన వారికి మళ్లీ ఎన్నికలు వచ్చే వరకు గేట్లు మూసివేస్తాను. నేను గెలిచిన తర్వాత పార్టీ కోసం పని చేసిన ప్రతి ఒక్కరికి ప్రాధాన్యత ఇస్తాను. ఎవరూ ఎలాంటి అపోహలకు పోవద్దు. పార్టీ విజయం కోసం ప్రతి ఒక్కరూ పని చేసి పార్టీని అధికారంలోకి తెచ్చుకోవాలి.

ప్రశ్న: నలభై ఏళ్ల ఉదయగిరి రాజకీయ ప్రస్థానంలో మేకపాటి కుటుంబం నియోజకవర్గానికి చేసిన మేలు ఏమిటి?

జవాబు: మా అన్న రాజమోహన్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఉదయగిరిలో సొంత నిధులతో డిగ్రీ కాలేజీతో పాటు అనేక ఉన్నత, అప్పర్ ప్రైమరీ పాఠశాలలు ఏర్పాటు చేశారు. వీటికి అవసరమైన సొంత నిధులు ఖర్చు చేశారు. ఉదయగిరిని విద్య పరంగా అభివృద్ధి చేసేందుకు నవోదయ స్కూల్ ఏర్పాటు, ఇంజినీరింగ్ కాలేజీ ఏర్పాటు చేశాం. మా అబ్బాయి గౌతమ్ అకాల మరణం తర్వాత ఆయన పేరుతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వ్యవసాయ కాలేజీకి రూ.250 కోట్లు విలువ చేసే ఆస్తులను ప్రభుత్వానికి ఇచ్చాం. మా అన్న చంద్రశేఖర్ రెడ్డి హయాంలో మారుమూల పల్లెలకు తారు రోడ్లు, విద్యాలయాలు ఉదయగిరి ట్యాంక్ బండ్ వంటి ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయి. నేను సమన్వయకర్తగా అనేక పల్లెల్లో అంతర్గత సిమెంటు రోడ్లు వేయించాను.

ప్రశ్న: మీ ప్రత్యర్థి కాకర్ల సురేష్ ఉదయగిరికి మేకపాటి కుటుంబం చేసింది ఏమిలేదని, తనకు ఒక అవకాశం ఇవ్వాలంటున్నారు?

జవాబు: కాకర్ల సురేష్ ఒక ఎన్ఆర్ఐ. విదేశాల్లో వ్యాపారాలు చేసుకుంటూ ఉంటారు. రాజకీయాలపై ఆసక్తితో ఇక్కడికి వచ్చి ఉండొచ్చు. మేకపాటి కుటుంబం నియోజకవర్గ అభివృద్ధికి ఏమి చేశారనేది, చేస్తున్నది ఆయనకు తెలియక పోవచ్చు. ఇక్కడి ప్రజలకు తెలుసు. విదేశాల్లో వ్యాపారాలు చేసుకుంటూ ఫ్యాషన్ కోసం రాజకీయాలు చేస్తున్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ఏం చేస్తే ఉపయోగం ఉంటుందో.. రాబోయే ఐదేళ్లలో వారికి ఏమైనా ప్రణాళికలు ఉన్నాయా? ఏమీ లేవు. మాపై ఆరోపణలు చేయడం, ఒక్క అవకాశం ఇవ్వండంటే.. రాజకీయం ఫ్యాషన్ కాదు.. ప్రజల భవిష్యత్. అటువంటి వ్యక్తికి అవకాశం ఇస్తే ఇక్కడ ప్రజలకు ఆయన చేసేది ఏమి ఉండదు. గెలిచిన.. ఓడినా ఇక్కడ ఉండరు. ప్రజలకు చేసే మేలు ఏమి లేదు. అభివృద్ధి ఏమి ఉండదు. మా 'ఫ్యామిలీ' నలభై ఏళ్ల నుంచి ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సేవలో ఉంది. కష్ట నష్టాల్లో మేము భాగస్వామ్యులుగా ఉన్నాం. నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్నాం. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వారికి సేవ చేస్తున్నందునే మా కుటుంబాన్ని ప్రజలు ఆదరిస్తున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలన అందిస్తున్నారు. ప్రజలకు మేలు జరుగుతున్నప్పుడు మార్పు ఎందుకు కోరుకుంటారు. ఈ ఎన్నికల్లో మంచి మెజార్టీతో విజయం సాధిస్తాం.

ప్రశ్న: ఎమ్మెల్యేగా మీరు విజయం సాధిస్తే నియోజకవర్గానికి చేసే అభివృద్ధి ఏమిటి?

జవాబు: సాగు, తాగునీటికి అధిక ప్రాధాన్యత ఇస్తాను. వెలుగొండ జలాలు, సోమశిల హైలెవల్ కాలువ పనులు పూర్తి చేసి బీడు భూములను సస్యశ్యామలం చేస్తాం. పురాతన చెరువులను అభివృద్ధి చేసి సాగునీటి వనరుల సామర్థ్యం పెంచుతాం. ఉదయగిరి ట్యాంక్ బండ్ పనులు పూర్తి చేస్తాం. ఉదయగిరి దుర్గంతో పాటు ఇతర పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేస్తాం. ముఖ్యంగా మా కుటుంబం ఆధ్వర్యంలో 'ఉదయ్' అనే సంస్థను నెలకొల్పి అందుకు అవసరమైన కొంత సొంత నిధులు జమ చేసి సేవ కార్యక్రమాలు చేపడతాం. నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం అధిక ప్రాధాన్యత ఇస్తాం. నియోజకవర్గంలో నలు దిక్కుల జాతీయ రహదారుల పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇవి పూర్తయితే చాలా పరిశ్రమలు ఇక్కడకు వస్తాయి. తాము కూడా పరిశ్రమలు నెలకొల్పి యువతకు అవకాశాలు కల్పిస్తాం.

ప్రశ్న: పోలింగ్‌కు మరో రెండు రోజులు మాత్రమే గడువు ఉంది. ఉదయగిరి భవిష్యత్‌ను నిర్ణయించే నియోజక వర్గ ప్రజలకు మీరు ఏమి చెప్పాలనుకుంటున్నారు?

జవాబు: ఉదయగిరి ప్రస్తుత ప్రభుత్వ పాలనలోనే శరవేగంగా అభివృద్ధి జరుగుతోంది. ఈ విషయం ప్రజల కళ్ల ముందు కనిపిస్తోంది. గతంలో ఇలాంటి అభివృద్ధిని చూశారా?. వ్యక్తిగతంగా ప్రజలకు ఐదేళ్లలో అందించిన సంక్షేమం గత ప్రభుత్వం అందిందా? అనే విషయాలను గుర్తు చేసుకోవాలని ప్రజలను కోరుకుంటున్నాను. అనేక పనులు నిర్మాణంలో ఉన్నాయి. ముఖ్యంగా పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయరు పనులు, సోమశిల హైలెవల్ కెనాల్ పనులు, సోమశిల ఉత్తర కాలువ పనులు, కావలి కాలువ అభివృద్ధి, నందిపాడు–ఉదయగిరి రోడ్డు విస్తరణ పనులు, వివిధ జాతీయ రహదారుల పనులు జరుగుతున్నాయి. ఇవి పూర్తి కావాలంటే మళ్లీ జగన్ సీఎం కావాలి. వచ్చే ఐదేళ్లల్లో ఉదయగిరి నియోజకవర్గం అన్నీ విధాలా అభివృద్ధి చెందాలంటే ఎవరితో సాధ్యమో ప్రజలు నిర్ణయించుకుని ఓటు వేయాలని కోరుకుంటున్నారు.

మళ్లీ ఫ్యాన్ ప్రభంజనమే

- సర్వేపల్లిలో ఐదేళ్లలో పదేళ్ల అభివృద్ధి చేసి చూపా
- ఇండస్ట్రియల్ కారిడార్లో నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు
- సర్వేపల్లి నిరోధకుడిగా మారిన టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి
- 'సాక్షి' ఇంటర్వ్యూలో కాకాణి గోవర్ధన్‌రెడ్డి



సంక్షేమం, అభివృద్ధినే ప్రజలు చూస్తారు

పొదలకూరు: జిల్లా రాజకీయాల్లో సర్వేపల్లి స్థానానికి ప్రత్యేక స్థానం ఉంది. నియోజకవర్గ తూర్పు సిగలో పోర్టు, థర్మల్ పవర్ స్టేషన్లు, అనుబంధ పరిశ్రమలు. గెలుపును మరిచిపోయిన టీడీపీ.. ఓటమి ఎరుగని వైఎస్సార్‌సీపీ. త్వరలో మరో రెండు రోజుల్లో జరగనున్న ఎన్నికల్లో మళ్లీ ఫ్యాన్ ప్రభంజనమే అంటున్న సర్వేపల్లి ఎమ్మెల్యే, అభ్యర్థి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో ప్రత్యేక ఇంటర్వ్యూ.

ప్రశ్న: సర్వేపల్లి ఎమ్మెల్యేగా 2014, 2019 రెండు పర్యాయాలు వరుసగా ఎన్నికయ్యారు. మంత్రిగా పనిచేశారు. ఈ పర్యాయం మీకే ఎందుకు ఓటు వేయాలి?

జవాబు: సంక్షేమం, అభివృద్ధిని చూసి ప్రజలు ఓట్లు వేస్తారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనే మాకు శ్రీరామ రక్ష. నేను సర్వేపల్లి నియోజకవర్గానికి స్థానికుడను. అధికార పార్టీ ఎమ్మెల్యేగా, మంత్రిగా నియోజకవర్గంలో చరిత్రలో ఎన్నడు లేని విధంగా అభివృద్ధి చేశాను. సర్వేపల్లి నియోజకవర్గాన్ని ఇండస్ట్రియల్ కారిడార్‌గా మార్చి వేలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాం. ఎమ్మెల్యేగా, మంత్రిగా సాగునీరంటే తెలియని గ్రామాలకు సాగునీటిని పారించి పంటలు పండించాను. రూ.100 కోట్లతో మంచినీటి సమస్యలను పరిష్కరించాను. సమృద్ధిగా సాగునీటిని అందించి పంటలు పండించగలిగాను. గ్రామాల్లో ఎక్కడా మట్టిరోడ్డు అన్నది లేకుండా సిమెంటు రోడ్లు, సైడ్ డ్రెయిన్లను రూ.375 కోట్లతో నిర్మించడం జరిగింది. ప్రజలకు ఏది అవసరమో తెలుసుకునే నాయకుడిని కాబట్టే నాపై నమ్మకంతో ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఏమి చేయలేకపోయినా తిరిగి అధికారంలో కూర్చో పెట్టారు. ప్రతిపక్షాలను ప్రజలు పట్టించుకోడం లేదు.

ప్రశ్న: మీకు ప్రజాసేవలో బాగా సంతృప్తిని ఇచ్చిన అంశాలు ఏవంటే ఏమి చెబుతారు?

జవాబు: కోవిడ్ కష్టకాలంలో నియోజకవర్గ ప్రజలకు తోడుగా ఉండి వారిలో ధైర్యాన్ని నింపి రూ.1.50 కోట్ల విలువైన బియ్యం, సరుకులు పంపిణీ చేయడం సంతృప్తినిచ్చింది. వెంకటాచలం మండలం రామదాసుకండ్రిక, ఇడిమేపల్లి గ్రామాల రైతులకు సాగునీటిని అందించి దగ్గరుండి పంటలు పండించగలిగాను. ఆ సమయంలో వారి కళ్లలో ఆనందం నాకు ఎంతో సంతృప్తినిచ్చింది. రైతులకు ఎంత సేవ చేసినా తక్కువేనని నాకు అనిపించింది.

ప్రశ్న: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త ముఖాలు పార్టీలోకి వచ్చి తిరిగి వెళ్లిపోయారు. వారి వల్ల పాతవారు కొంత ఇబ్బంది పడ్డారు. దీన్ని ఎలా చూస్తారు?

జవాబు: నియోజకవర్గానికి నేను ఎమ్మెల్యేను. అందుకే పార్టీలు చూడకుండా పనులు చేసి పెట్టడం జరిగింది. అయితే నా వద్ద అన్ని పనులు చేయించుకుని ఓట్లు వేసే సమయంలో కొందరు వెళ్లిపోయిన మాట వాస్తవం. ఇక్కడ మరో మాట చెప్పాలి. పాత నాయకులు, కార్యకర్తలను నేనెప్పుడూ నిర్లక్ష్యం చేయలేదు. వారి ప్రాధాన్యతను తగ్గించనూ లేదు. కొన్ని పొరపాట్లు జరిగినట్లు ఇప్పుడు గుర్తించడం జరిగింది. భవిష్యత్‌లో అలాంటి పొరపాట్లు చేయకుండా పాతవారు, నాకు ఎల్లవేళలా సపోర్ట్‌గా నిలిచిన వారిని గుండెల్లో పెట్టుకుని చూసుకుంటాను.

ప్రశ్న: టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి పదే పదే మీ కేసుల గురించి ప్రస్తావించడం, జైలుకు పంపుతానని సవాళ్లు విసరడాన్ని మీరు ఎలా చూస్తారు?

జవాబు: నాపై ఉన్న కేసులన్ని సోమిరెడ్డి పెట్టించిన అక్రమ కేసులే. కోర్టులో రికార్డుల చోరీ కేసుపై నేనే సీబీఐ దర్యాప్తును ఆహ్వానించడం జరిగింది. సీబీఐ దానిపై నాకు క్లీన్ చిట్ ఇవ్వడం అందరికి తెలిసిందే. నేను పదేపదే సోమిరెడ్డిని, చంద్రబాబును కోరేది ఒక్కటే నాలాగా మీరు కూడా సీబీఐ విచారణను స్వీకరించే దమ్ము, ధైర్యం ఉందా.

ప్రశ్న: సోమిరెడ్డిపై మూడో పర్యాయం హ్యాట్రిక్ విజయం సాధించడం అంత సులువేనా?

జవాబు: నేనెప్పుడు నా పర్యటనలో చెబుతూ ఉంటాను. సోమిరెడ్డి లాంటి నీతిమాలిన రాజకీయ నాయకుడిపై పోటీ చేయడం నా దురదృష్టమని. ఇప్పటికే రెండు పర్యాయాలు అతడిని ప్రజలే మట్టి కరిపించారు. మూడో సారి మంచి మెజారిటీతో హ్యాట్రిక్ విజయం సాధిస్తాను.

ప్రశ్న: సోమిరెడ్డి మాటిమాటికి మీరు నిర్మించుకున్న ఇంటిని కరోనా ప్యాలెస్, అవినీతి, మైనింగ్ మాఫియా అంటూ ఆరోపణలపై మీ స్పందన?

జవాబు: కరోనా కష్టకాలంలో నేను ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేశాను. సోమిరెడ్డి ఆ సమయంలో ఎక్కడో దాక్కున్నాడు. నేను ప్రజల్లో తిరిగి వారికి సేవ చేయడాన్ని జీర్ణించుకోలేకనే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నాడు. అవినీతిపై యుద్ధం చేసిన నేను అవినీతికి పాల్పడ్డానంటే ప్రజలు నమ్మరు. మైనింగ్‌తో నాకు ఎలాంటి సంబంధం లేదు. సోమిరెడ్డి మైనింగ్ చేసుకుంటున్న వారిని బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు ముట్టజెప్పే వారి జోలికి వెళ్లకుండా ఇవ్వని వారిపై ఆరోపణలు, ధర్నాల పేరుతో బిల్డప్‌లు ఇవ్వడం చూశాం. నన్నేమి చేయలేక రకరకాల ఆరోపణలు చేస్తూ ఓట్లు దండుకోవాలని చూస్తున్నాడు.

ప్రశ్న: సోమిరెడ్డి వరుస ఓటముల వల్ల సింపతి పని చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది?

జవాబు: సోమిరెడ్డి వంటి నీచుడు లేడనే ప్రజలు ఇరవై ఏళ్లుగా వెలేశారు. ఏ రోజైనా ప్రజల పక్షాన నిలబడి పోరాడాడా? సింపతి రావడానికి. ప్రజలకు కరోనా కష్టకాలంలో అండగా నిలబడ్డాడా? నియోజకవర్గ అభివృద్ధి కోసం పాటు పడ్డాడా? ఇందులో ఒక్క అంశంపై కూడా ఆయన చేసింది శూన్యం. అధికారంలో ఉన్నప్పుడు ధాన్యానికి గిట్టుబాటు ధరలు లేకుండా రైతులను ముప్పు తిప్పలు పెట్టాడు. ఇపుడు 30 శాతం అదనంగా ధాన్యానికి గిట్టుబాటు ధరలు లభిస్తుండడంతో రైతులు సంతోషంగా ఉన్నారు. కనుక అభివృద్ధి, సంక్షేమం ముందు సింపతీలు పని చేసే ప్రశ్నే లేదు.

ప్రశ్న: దేగపూడి–బండేపల్లి కాలువ నిర్మాణంపై మీరు నిర్లక్ష్యం వహించారనే ఆరోపణలపై ఏమి చెబుతారు?

జవాబు: దేగపూడి–బండేపల్లి కాలువ నిర్మాణానికి సోమిరెడ్డి అవినీతే శాపంగా మారింది. సోమిరెడ్డి ఒక్క రూపాయి ఖర్చు పెట్టకుండా, భూ సేకరణకు ఒక్క రూపాయి మంజూరు చేయకుండా హడావుడిగా జీఓను తీసుకొచ్చి కాంట్రాక్టర్ వద్ద ముడుపులు తీసుకుని వెళ్లిపోయాడు. ఆయన హడావుడి నిర్ణయాలు, ఎలాంటి అనుమతులు లేకపోవడం వల్లనే కాలువ తవ్వకం పనుల్లో జాప్యం జరిగింది. కాలువకు సంబంధించి నేను వచ్చిన తర్వాత భూసేకరణ పూర్తి చేయించడం జరిగింది. అయితే భూసేకరణ విషయం కోర్టు కేసులు పెండింగ్లో ఉన్నాయి. కాంట్రాక్టర్ ప్రభుత్వ భూమి ఉన్నంత వరకు పనులు చేయడం జరిగింది. న్యాయ పరమైన సమస్యలు, సోమిరెడ్డి హయాంలోనే మధ్యలో రైల్వే లైను వచ్చి దానికి కేంద్ర ప్రభుత్వ అనుమతులు లభించకపోవడం వంటి సమస్యల వల్ల కాలువ తవ్వకం పనుల్లో జాప్యం జరిగింది.

ప్రశ్న: మీ సొంత మండలం పొదలకూరుపై సోమిరెడ్డి దృష్టి పెట్టి మెజారిటీ సాధించాలని ప్రయత్నిస్తుంటారు?

జవాబు: నా సొంత గడ్డపై నాకు ఎనలేని అభిమానం, నా తండ్రి కాకాణి రమణారెడ్డి నాకు ఇచ్చిన అతిపెద్ద ఆస్తి నా మండల ప్రజలు. ఇక్కడే సోమిరెడ్డి ప్రతిసారి పట్టు సాధించాలని ప్రయత్నించి చతికిల పడుతున్నాడు. పటిష్టమైన కేడర్, అభిమానులు, నా కోసం ఎంత దూరమైనా వెళ్లే నా సొంత తమ్ముళ్లు, అన్నలు ఉన్నంత వరకు మండలంలో సోమిరెడ్డి లాంటి వారు వంద మంది వచ్చినా ఏమి చేయలేరని గర్వంగా చెప్పగలను.

ప్రశ్న: భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలు ఏమి అనుకుంటున్నారు?

జవాబు: సర్వేపల్లి నియోజకవర్గంపై నాకు పూర్తి స్థాయిలో విజన్ ఉంది. సాగునీటి రంగాన్ని మరింతగా అభివృద్ధి చేయడంతో పాటు, పరిశ్రమలను అధిక సంఖ్యలో స్థాపించి యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలి. ఇప్పటికే ముత్తుకూరు మండలంలో ఉన్న పరిశ్రమల్లో సుమారు 6 వేలకు పైబిలుకు ఉద్యోగాలు చేస్తున్న యువత ఉన్నారు. స్థానికులకే ఉద్యోగాలు అన్న మాటకు కట్టుబడి యువతకు ఉద్యోగాలు కల్పించడం జరుగుతుంది. సర్వేపల్లిని సర్వోతో ముఖాభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు ఉన్నాయి. ఇప్పటికే రూ.200 కోట్లతో నియోజకర్గంలో ఆర్‌అండ్‌బీ రోడ్లను ఆధునీకరించడం జరిగింది. పురోగతిలో ఉన్న జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించి పేదలకు అందజేయడం, ఇంటింటికి మంచినీటి కుళాయి కనెక్షన్ తదితర పనులను పూర్తి చేస్తాను.

ప్రశ్న: మరో రెండు రోజుల్లో ఎన్నికలు ఉన్నాయి. ప్రజలకు మీరు ఏమి చెబుతారు?

జవాబు: చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలను ఒక్కటి నెరవేర్చలేదు. జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన వాగ్దాలనన్నింటిని అమలు చేసి చూపారు. కాబట్టి చెప్పి ఎగ్గొట్టిన చంద్రబాబు కావాలా? చెప్పినవి చెప్పినట్టు అమలు చేసిన జగన్‌మోహన్‌రెడ్డి కావాలాని ప్రజలకు చెప్పదలుచుకున్నాను. చంద్రబాబు కొత్తగా రాజకీయాల్లోకి వచ్చినట్టు నటిస్తూ ప్రజలు అవకాశం ఇస్తే హామీలను అమలు చేస్తానని చెప్పడం మోసపూరితం. గతంలో ప్రజలు ఆయనకు అవకాశం ఇచ్చినా చేయలేకపోయాడు. ఒక్క అవకాశం తీసుకున్న జగన్ ప్రతి కుటుంబానికి సంక్షేమం, అభివృద్ధిని అందించారు.